క్లుప్తంగా

విద్యార్థులకు సత్కారం



సిరికొండ: అగ్నిపథ్‌లో ఇండియన్ ఆర్మీకి ఎంపికైన పూర్వ విద్యార్థులను సత్యశోధక్ పాఠశాలలో గురువారం ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులైన గడ్డల నిహల్, దేశెట్టి అరుణ్ కుమార్‌లు అగ్నిపథ్ ఫలితాలలో ఇండియన్ ఆర్మీ జనరల్ డ్యూటీ విభాగంలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి ప్రిన్సిపాల్ నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికలు అందచేసి అభినందించారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా అనుకున్న లక్ష్యం సాధించడం కోసం గట్టిగా ప్రయత్నించాలని తెలిపారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, రవి, ప్రశాంత్, సతీష్ పాల్గొన్నారు.

చిరంజీవాచార్యులకు సన్మానం



నిజామాబాద్ సిటీ: 'సీతారామ కల్యాణం' హరికథాగానం చేసిన నిజామాబాద్‌కు చెందిన చిరంజీవాచార్యులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కిన్నెర కల్చరల్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి 71వ జన్మదిన సందర్భంగా హరికథా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం చిరంజీవాచార్యులు 'సీతారామ కల్యాణం' హరికథాగానం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): స్నేహ సొసైటీకి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఐసీడీఎస్ ఇంచార్జి పీడీ సుధారాణి ఆవిష్కరించారు. దివ్యాంగుల కోసం వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు సొసైటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, సంయుక్త కార్యదర్శి దయానంద్, సుధాకర్, ప్రిన్సిపల్ జ్యోతి, రాజేశ్వరీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయాలని పిలుపు



ధర్పల్లి: జక్రాన్‌పల్లిలో ఈ నెల 5న జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని యూని యన్ జిల్లా నాయకులు బాలయ్య, కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్పల్లి మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. బాలయ్య మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 30 శాతం పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నేతలు భూమేష్, సంజీవ్, రాజన్న రామాంజనేయులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి అనుమతివ్వొద్దు



డిచ్‌పల్లి: ఘన్‌పూర్ నుంచి డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన చేపట్టిన చర్చి నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వవద్దని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చర్చి నిర్మాణ పనులు చేపడుతున్న ఇద్దరు తాపీ మేస్త్రీలపై ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి ఖిల్లా గ్రామ పెద్దలు గడ్డం రాధాకిష్టారెడ్డి, ఉప సర్పంచ్ ఆసది రవీందర్, వీడీసీ సభ్యులు మాట్లాడుతూ.. చుట్టూ హిందువుల గృహాలు ఉన్నచోట చర్చి ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. సమీపంలోనే రెండు చర్చిలు ఉన్నాయని మళ్లీ మరొక చర్చి నిర్మాణం చేయడం సమంజసం కాదన్నారు. చర్చి నిర్మాణ పనులు మానుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అరకొర కేటాయింపులతో చేటు

- బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల డిమాండ్



తెయూ రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని అటకెక్కిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కొఠారి కమిషన్ ఆదేశాల మేరకు విద్యారంగాన్ని పటిష్టం చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు గాలికి వదిలి బడా కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు, ఎమ్మెల్యేల జీతాలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అధ్యాపకులు ప్రభంజన్, రమణాచారి, స్వామిరావు, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

విస్మరించడం సిగ్గు చేటు: ఎస్‌ఎఫ్‌ఐ



చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు

నిజామాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యా రంగాన్ని విస్మరించడం సిగ్గుచేటని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అన్నారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నేతలు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా 'ప్రభుత్వ విద్య' అనే పదాన్ని ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే విద్యను కార్పొరేట్ శక్తులకు పరిమితం చేసేటట్టుగా ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



డిచ్‌పల్లిలో దహనం చేస్తున్న నేతలు

డిచ్‌పల్లి: తెలంగాణ రాష్ట్రానికి విద్యా సంస్థలను కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) డిచ్‌పల్లి కమిటీ కార్యదర్శి దినేష్ ఆరోపించారు. నిరసనగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా విద్యారంగాన్ని విస్మరించిందన్నారు. ఈ బడ్జెట్ కేవలం ఎన్నికల బడ్జెట్ తప్ప విద్యార్థులకు, యువతకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. నాయకులు సుమన్, మహేష్, మనోజ్, హరీష్, గౌతమ్, ఫయాద్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న తెయూ పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వర్సిటీ పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, జయంతి డిమాండ్ చేశారు. గురువారం క్యాంపస్‌లోని బాలికల వసతి గృహం వద్ద వారు మాట్లాడారు. పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో బాలుర కన్నా బాలికలు ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు పొందారని తెలిపారు. బాలురకు రెండు వసతి గృహాలు ఉన్నాయని, కానీ బాలికలకు ఒకటే వసతి గృహం ఉండటంతో గదులు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే బాలికలకు నూతన హాస్టల్ నిర్మించాలని, క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, క్యాంటీన్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వర్సిటీల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెయూ పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు శివసాయి , నాయకులు అక్షయ్, ఆకాష్, శేషు, శ్రావణి చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-4లో ఇంటర్ పాసైన వారికి అవకాశమివ్వాలి

సుభాష్‌నగర్: ఇంటర్ పాసైన వారికి గ్రూప్-4లో అవకాశం కల్పించాలని ఇందూరు అన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు తర్ల కీర్తికుమార్ గురువారం డిమాండ్ చేశారు. ఈవిషయమై హైకోర్టులో పిటిషన్ వేశామని తెలిపారు. కారుణ్య నియామకాల కోటాలో ఇంటర్ పాసైన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా అవకాశం, ఐదేళ్ల సమయం ఇచ్చి డిగ్రీ పాస్ కావడానికి వెసులుబాటు కల్పిస్తున్నారని గుర్తుచేశారు. గ్రూప్-4లో కూడా ఇంటర్ పాసైన వారికి అవకాశం కల్పించాలని హైకోర్టును ఆశ్రయించామన్నారు. పిటిషన్ విచారించిన హైకోర్టు ప్రభుత్వం, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిందని కీర్తికుమార్ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



సన్మానిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

డిచ్‌పల్లి: సుద్దులం గ్రామం గంగపుత్ర సంఘం భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంఘం సభ్యులు గురువారం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. అనంతరం గంగపుత్ర సంఘం సభ్యులు ఎమ్మెల్యే బాజిరెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జీనియస్ నారాయణ రెడ్డి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కస్ప శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ముత్యం బాబు, తదితరులున్నారు.

స్కూల్ గుర్తింపును రద్దు చేయండి



ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న నేతలు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని గురువారం టీజీవీపీ నగర అధ్యక్షుడు అఖిల్, ఎంఈవో రామారావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. స్కూల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. సొంత భవనం లేకుండా వాణిజ్య సముదాయాలపైన అద్దె భవనంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఏడో తరగతి వరకే అనుమతులు తీసుకొని పదవ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. స్కూల్ గుర్తింపును రద్దు చేయడంతో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



బోర్గాం(పి)లో శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సౌజన్య



మునిపల్లిలో.. జెడ్పీటీసీ తనూజారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ సందగిరి సౌజన్య రాజశేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని డివిజన్‌వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు నెల రోజుల పాటు శిబిరం కొనసాగుతుందన్నారు.

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం పాల్దాలో గురువారం కంటి వెలుగు శిబిరం ప్రారంభమైంది. జెడ్పీటీసీ బొల్లంక సుమలత, గ్రామ సర్పంచ్ సుప్రియలు శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెలా 13 వరకు శిబిరం కొనసాగనుంది. తొలిరోజు 124 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 36 మందికి దగ్గర చూపు (రీడింగ్ అద్దాలు), కంటి చూపు సమస్య ఎక్కువగల 36 మందికి ఆర్డర్‌పై అద్దాలు తెప్పించి ఇవ్వనున్నట్లు వైద్యులు తెలిపారు. వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, పాల్దా, గుండారం సొసైటీల చైర్మన్లు గాడి జితేందర్, దాసరి శ్రీధర్, తిర్మన్‌పల్లి, శ్రీనగర్ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన

జక్రాన్‌పల్లి: మునిపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం జెడ్పీటీసీ సభ్యురాలు పాట్కురి తనూజారెడ్డి సందర్శించారు. పరీక్షల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన బాధితులకు కళ్లద్దాలు అందించాలని కోరారు. సర్పంచ్ సాయరెడ్డి, ఉపసర్పంచ్ సాయన్న పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



డిచ్‌పల్లి: ఘన్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం రెండో రోజు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా పలు పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు ప్రదీప్ దేశ్‌పాండే తెలిపారు.

ద్వారకానగర్‌లో హరినామ నగర సంకీర్తన



నిజామాబాద్ సిటీ: నగరంలోని ద్వారకానగర్‌లో గురువారం ఇస్కాన్ నిజామాబాద్(ఇందూరు) వారి ఆధ్వర్యంలో సర్వమానవాళి శ్రేయస్సు కోసం హరినామ సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ నిజామాబాద్ అధ్యక్షుడు శ్రీమాన్ సిద్ధ బలరాం దాస్ మాట్లాడారు.

ముగిసిన ఎదురుకొండ బ్రహ్మోత్సవాలు



సిరికొండ: తూంపల్లి అడవుల్లో కొలువైన ఎదురుకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా పురోహితులు దేవేరుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం కన్నుల పండువగా జరిపారు. భక్తులు భారీగా తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, ధర్పల్లి, సిరికొండ జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, మాన్‌సింగ్ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు..



జక్రాన్‌పల్లి: కొలిప్యాక్‌లో ఆనందగిరి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు దండల మోహన్‌శర్మ ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా మద్వరాయల గుట్టపైకి తీసుకెళ్లారు. సర్పంచ్ గంగు బాలయ్య, ఉపసర్పంచ్ అజయ్, మాజీ ఎంపీపీ దీకొండ హరిత, పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఈగ రమేష్‌రెడ్డి, ఈగ శ్రీనివాస్ రెడ్డి, సాయిరెడ్డి, శేఖర్‌రెడ్డి, పోతారెడ్డి పాల్గొన్నారు.

పంచముఖి ఆలయంలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ సిటీ: వినాయక్‌నగర్‌లోని శ్రీ పంచముఖి వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభానికి గురువారం భక్తులు



ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గతంలో ఉన్న ధ్వజస్తంభం పురాతన కావటంతో ఆలయ కమిటీ కొత్త ధ్వజ స్తంభాన్ని తయారు చేయించారు. ఆలయ కమిటీ, శ్రీ పంచముఖి వీరాంజనేయ స్వామి భక్త బృందాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ మల్లేష్ యాదవ్ తెలిపారు.

ఘనంగా ధ్వజారోహణం



డిచ్‌పల్లి: జిల్లాలో ప్రసిద్ధి పొందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం సీతారామచంద్రస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే నేతృత్వంలో అర్చకులు అగ్నిప్రతిష్ఠ, బేరిపూజ, దేవత ఆహ్వానం, సాయంత్రం నిత్య హోమం, బలిహరణం నిర్వహించారు. రాత్రికి శ్రీసీతారామచంద్రస్వామి వారి ఉత్సవ విగ్రహాలను హనుమంతుని వాహనంపై గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం మాజీ సర్పంచ్ గజవాడ గంగాదాస్, సుశీలాబాయి దంపతుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు కల్యాణోత్సవం..

తిరుక్కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరుగనుంది. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

నిజామాబాద్‌అర్బన్: మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి(9వ తరగతి) సోఫియాన్ చనిపోయిన ఘటనలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. విద్యార్థి చనిపోయినా కూడా సమాచారం ఎక్కడా బయటకు పొక్కకుండా దాచిపెట్టారని, మృతికి కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,800	వెండి (కిలో)	71,300
22 క్యారెట్స్	54,205	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	క్యాప్సికం	30	50
బెండకాయ	50	70	గాజరుగడ్డ	25	40
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	35	50	గోబిపువ్వు	20	40
పాలకూర	10	20	బీట్‌రూట్	20	40
మెంతికూర	25	40	గోరు చిక్కుడు	45	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1-పఠాన్(హిందీ),1.25,4.20, 7.20 10.15

స్క్రీన్-2- రైటర్ పద్మభూష,1.40,4.45 ,7.30 వాల్తేరు వీరయ్య,10.25

స్క్రీన్-3- మెఖేల్-10.35,1.35,4.35, 7.35,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 -పఠాన్ - (హిందీ),12.45 3.30,6.15,10.00

స్క్రీన్-2 రైటర్ పద్మభూష,10.05 వాల్తేరు వీరయ్య,12.45,7.20 పఠాన్-(హిందీ),4.05 10.40

స్క్రీన్-3- మైఖేల్-12.45,7.00 రెబల్స్ ఆఫ్ తుపక్,4.00 రైటర్ పద్మభూష,10.15

స్క్రీన్-4- రైటర్ పద్మభూష,1.25,7.20 ప్రేమదేశం,4.05 సువర్ణ సుందరి ,10.00

దేవి	వీరసింహారెడ్డి
నటరాజ్	పఠాన్(హిందీ)
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	సువర్ణ సుందరి
విజయ్	మైఖేల్

కనీస వసతులు కల్పించాలి



ఖలీల్‌వాడి: విద్యార్థులకు పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ సభ్యులు ఉల్లెంగుల నాగరాజు అన్నారు. గురువారం జక్రాన్ పల్లి మండలం అర్గుల్ గ్రామంలో ప్రైమరీ స్కూల్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లు బకాయిలు ఉండడంతో టీచర్లు విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. ప్రతి పాఠశాలకు సోలార్ కరెంట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన డెస్క్ బెంచీలు, కుర్చీలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపడా లేవన్నారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలన్నారు.

సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

రుద్రూర్: అసెంబ్లీలో ఆశావర్కర్ల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ గురువారం మోస్రా పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, ఎన్‌ఆర్ హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లుగా రూ.10 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని కోరారు.



కొత్త కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్‌ను కలిసిన టీజీవో అసోసియేషన్ ప్రతినిధులు

సాక్షి నెట్‌వర్క్ :జిల్లా కలెక్టర్‌గా ఇటీవల ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన రాజీవ్ గాంధీ హన్మంతును గురువారం నూతన కలెక్టరేట్‌లో పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు పలికారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు, టీజీవో అసోసియేషన్ ప్రతినిధులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) వెంకటరమణ, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సీపీఐ నేతలు, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్,రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.